సాక్షి మంచిర్యాల

శుక్రవారం, 13, అక్టోబర్, 2023

ఎఫ్‌సీఐ బోర్డు సభ్యుడిగా ఉదారి చంద్రమోహన్‌గౌడ్

పాతమంచిర్యాల: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బోర్డు సభ్యుడిగా జిల్లా కేంద్రం మంచిర్యాలకు చెందిన విద్యావేత్త ఉదారి చంద్రమోహన్‌గౌడ్ నియామకం అయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని ఎఫ్‌సీఐ ప్రాంతీయ కార్యాలయంలో నియామక పత్రాన్ని స్వీకరించినట్లు చంద్రమోహన్‌గౌడ్ తెలిపారు. ఈ పదవిలో రెండు సంవత్సరాలపాటు కొనసాగుతానని వివరించారు.

వాలీబాల్ ఎంపిక పోటీలు

చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి వాలీబాల్ ఎంపిక పోటీలను ఎంఈవో రాధాకృష్ణమూర్తి ప్రారంభించారు. అండర్–14, 17 విభాగాల్లో 50 మంది ఎంపికయ్యారు. ఎస్జీఎఫ్ కార్యదర్శి పరిమళ, సీనియర్ పీడీ యాకుబ్, హెచ్‌ఎం అబ్దుల్ హమీద్, పీఈటీలు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /24.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. ఈశాన్యం దిశగా ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ



పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

నెన్నెల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, మందులు, ఆస్పత్రి ఆవరణ పరిశీలించారు. సిబ్బంది విధులకు క్రమం తప్పకుండా వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. మెరుగైన సేవలు అందిస్తున్నారా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ జ్వరాలపై వైద్యాధికారి లక్ష్మణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, జ్వరాలు ఉన్న చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఫార్మాసిస్ట్ నారాయణ, ఏఎన్‌ఎం ఇందిరా, సిబ్బంది పాల్గొన్నారు.

దసరా సెలవులొచ్చేశాయ్



మంచిర్యాల కేజీబీవీలో విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్/దండేపల్లి: ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించడంతో వసతిగృహాల్లోని విద్యార్థులు గురువారం ఇంటిబాట పట్టారు. దసరా పండుగ నేపథ్యంలో ఈ నెల 13నుంచి 25 వరకు సెలవులు ప్రకటించారు. అక్టోబర్ 26న విద్యాసంస్థలు తెరుచుకోనున్నాయి. గురువారం ఆయా వసతిగృహాల వద్దకు విద్యార్థుల తల్లిదండ్రులు రావడంతో సందడి నెలకొంది. సెలవులు ముగియగానే విద్యార్థులను పాఠశాలలకు తీసుకురావాలని తల్లిదండ్రులకు స్పెషల్ ఆఫీసర్లు, ప్రధానోపాధ్యాయులు సూచించారు.

పోలీసులు బాధ్యతగా పని చేయాలి



మాట్లాడుతున్న ఏసీపీ సదయ్య

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరగడానికి పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య సూచించారు. గురువారం బెల్లంపల్లి డివిజన్ పోలీసు అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని తెలిపారు. నిషేధిత గంజాయి, గుడుంబా, అక్రమ నగదు రవాణా అడ్డుకోవాలని తెలిపారు. రౌడీషీటర్లను తహశీల్దార్ల ఎదుట బైండోవర్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి డివిజన్ పరిధిలోని సీఐలు మహేందర్‌రెడ్డి, రాజ్‌కుమార్‌గౌడ్, బన్సీలాల్, శ్రీనివాస్, ఎస్సైలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తాండూర్: ఎన్నికల సమయంలో సంఘ విద్రోహక శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య అన్నారు. గురువారం మండలంలోని సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలైన తాండూర్, చౌటపల్లి, అంకుశం గ్రామాలను సందర్శించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తాండూర్ శివారులోని రేపల్లెవాడ వద్ద అంతర్ జిల్లా చెక్‌పోస్టును సందర్శించి వాహనాలు తనిఖీ చేశారు. తాండూర్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రాజశేఖర్ పాల్గొన్నారు.

ఓటర్లకు ఎపిక్ కార్డులు




ఓటరు గుర్తింపు కార్డులు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఇటీవల ఓటు హక్కు పొందిన వారికి భారత ఎన్నికల సంఘం నూతన ఓటరు కార్డులు స్పీడు పోస్టు ద్వారా ఇళ్లకే పంపిస్తోంది. ఓటరు జాబితా సవరణ, మార్పులు, చేర్పులు నూతన ఓటర్ల నమోదు ఈ నెల 1 వరకు పూర్తి చేసి తుది జాబితా 4న విడుదల చేశారు. కొత్త ఓటర్లతోపాటు మార్పులు చేసిన వారికి స్పీడ్‌పోస్టు ద్వారా ఓటర్ గుర్తింపు కార్డు(ఎపిక్ కార్డు)లు ఇంటికి చేరుతున్నాయి. నూతన ఓటర్లతోపాటు అడ్రస్‌లు మార్పులు, చేర్పులు జరిగిన 27,281 మందికి కొత్త కార్డులు అందుతున్నాయి.

అధికారులూ.. తస్మాత్ జాగ్రత్త !

- నిర్మల్ జిల్లా కలెక్టర్‌పై ఎన్నికల సంఘం వేటు
- ఎమ్మెల్యేల సిఫారసుపైనే పని చేస్తున్న కొందరు ఖాకీలు
- కోడ్‌కు ముందు జరిగిన బదిలీల్లో అధికారుల పైరవీలు
- ఎన్నికల ప్రక్రియలో అధికారుల తీరుపైనా ఈసీ నిఘా



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సిఫారసులతో పని చేస్తున్న కొందరు అధికారుల్లో గుబులు మొదలైంది. అసెంబ్లీ ఎన్నికలు నిష్పక్షపాతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం అధికారులపై కొరడా ఝులిపిస్తోంది. రాష్ట్రంలో నలుగురు కలెక్టర్లు, ముగ్గురు సీపీలు, పది మంది ఎస్పీలతో సహా మరో నలుగురు రాష్ట్ర ఉన్నతాధికారులను ఎన్నికల విధుల నుంచి తప్పించి వేటు వేసిన విషయం తెలిసిందే. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి సైతం ఉన్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో ఇంకా కొందరు అధికారులు అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో చెట్టాపట్టాలు వేసుకుని తిరిగిన వారిపైనా చర్యలకు ఉపక్రమించే అవకాశం లేకపోలేదు. ఎమ్మెల్యేలతో సన్నిహితంగా ఉంటూ వారికి అనుకూల పనులు చేస్తూ కొందరు అధికారులు కూడా లబ్ధి పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రెవెన్యూ, పోలీసు, ఇతర యూనిఫాం, సర్వీసులో ఉన్న కొందరు ఇప్పటికీ నేతల సిఫారసుపైనే పని చేస్తున్నారు. ఎన్నికల నియమావళిని పక్కనబెట్టి కూడా సొంత జిల్లా, మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అధికారులు ఉన్నారని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. తహసీల్దార్, ఆర్డీవో అధికారుల వరకు బదిలీల్లో పైరవీలు సాగాయి. నచ్చని చోట తహసీల్దార్లు పోస్టింగ్‌లో చేరకుండా బెట్టు చేసిన వారూ ఉన్నారు. ఉమ్మడి జిల్లా పది నియోజకవర్గాల పరిధిలో గత జూలై, ఆగస్టులో బదిలీలు జరిగాయి. కొందరు విధుల్లో చేరకముందే మొదట వచ్చిన ఉత్తర్వులు మార్చుకుని మరీ నచ్చిన చోట చేరిపోయారు. ఆర్డీవో(రిటర్నింగ్ అధికారి), తహసీల్దార్(అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి) ఎన్నికల్లో కీలకంగా వ్యవహరిస్తారు. ఆ స్థాయి అధికారులను సైతం ముందే అనుకూలమైన వారిని తెచ్చుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈసారి ఎన్నికల్లో నగదు, మద్యం, బహుమతులు విచ్చలవిడిగా పంపిణీ చేసే అవకాశం ఉందనే నేపథ్యంలో ఎన్నికల సంఘం (ఈసీ) 'సీ–విజిల్' యాప్‌లో ఎవరైనా ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలపై ఫిర్యాదు చేయొచ్చు. ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లోనే చర్యలు తీసుకుంటామని ఈసీ ప్రకటించింది.

ఎస్పీపై ఆర్‌ఎస్పీ ఆరోపణలు

కుమురంభీం జిల్లా ఎస్పీపై సిర్పూర్ బీఎస్పీ అభ్యర్థి, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఐఏఎస్, ఐపీఎస్‌ల వేటుపై స్పందిస్తూ 'ఇక్కడి ఎస్పీని బదిలీ చేయడం ఈసీ మరిచిపోయింది..' అంటూ ఆరోపించారు. మంచిర్యాల జిల్లాలోనూ కొంతమంది అధికారులు నిష్పక్షపాతంగా పని చేయడం లేదని కొందరు విపక్ష నేతలు రాష్ట్ర అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి ఇప్పటికే కొన్ని ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు సమాచారం.

'ఖర్చు' చేసుకున్న ఖాకీలు..

రెండు నెలల క్రితం జరిగిన పోలీసు బదిలీల్లో కొందరు పోలీసులు రూ.లక్షలు ఖర్చు చేసుకుని నచ్చిన పోలీసుస్టేషన్‌లో విధుల్లో చేరారు. అయితే కొందరికి అనూహ్యంగా మళ్లీ స్థానం చలనం కలిగింది. ఇంకా కొందరు అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ రావడంతో అధికార యంత్రాంగం అంతా ఎన్నికల కమిషన్ పరిధిలోనే పని చేస్తుంది. ఈ క్రమంలో ఎవరైనా అధికారులు ఎన్నికల విధుల్లో నిష్పక్షపాతంగా పని చేయకపోతే బదిలీ వేటు తప్పకపోవచ్చు. ప్రజాప్రతినిధుల సిఫారసులు కష్టపడి తెచ్చుకుని 'ఖర్చు' చేసుకుని వచ్చి కోరుకున్న సీటులో కూర్చున్న కొంతమంది ఖాకీలకు ఇబ్బందికరంగా మారే అవకాశాలు ఉన్నాయి.

ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్
- కంట్రోల్ రూం ప్రారంభం



మానిటరింగ్ కంట్రోల్ రూం ప్రారంభిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల్లో భాగంగా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచారం సంబంధిత ప్రకటనలకు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి ఎన్నికల నిర్వహణలో భాగంగా ఫిర్యాదులు, సెల్, కంట్రోల్‌రూం, మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వార్తల ప్రసారం, అభ్యర్థుల ప్రచార వ్యయం లెక్కిస్తామని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రకటనల కోసం అందిన దరఖాస్తులను పరిశీలించి సకాలంలో అనుమతి మంజూరు చేయాలని సూచించారు. ఈ–పేపర్లు, స్థానిక కేబుల్ నెట్‌వర్క్, సోషల్ మీడియా, ప్రింట్ మీడియా, ఎస్సెమ్మెస్‌లు, ఇతర ఆడియో, వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలకు ముందస్తు అనుమతి పొందాలని అన్నారు. ఎన్నికల సంబంధిత ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూం, టోల్‌ఫ్రీ నంబరు 1950, 08736–250504 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్, జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఏఎస్.వినీత, ఎంసీఎంసీ నోడల్ అధికారి, జిల్లా పౌరసంబంధాల అధికారి వై.సంపత్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇక్కడ గన్ చోరీ.. అక్కడ కాల్పులు

- గుండ్లసింగారంలో అత్తను కాల్చిన అల్లుడు
- ఆర్థిక లావాదేవీలే కారణం..
- నిందితుడు కోటపల్లిలో కానిస్టేబుల్
- భార్య, బావమరిదితోపాటు అత్త టార్గెట్?
- ఆ సమయంలో ఇంట్లో బావమరిది లేకపోవడంతో సేఫ్
- సంఘటన స్థలాన్ని సందర్శించిన డీసీపీ



ఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

హసన్‌పర్తి/కోటపల్లి: గ్రేటర్ వరంగల్ పరిధిలోని రెండవ డివిజన్ గుండ్లసింగారంలో గురువారం జరిగిన కాల్పుల ఘటన మంచిర్యాల జిల్లాలోనూ కలకలం రేపింది. అప్పుగా ఇచ్చిన డబ్బు ఇవ్వలేదని ఓ కానిస్టేబుల్ పోలీసు సర్వీస్ రివాల్వర్‌తో అత్తపై కాల్పులు జరపడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. వరంగల్ నగరంలోని కీర్తినగర్‌కు చెందిన అడ్డె ప్రసాద్‌కు గుండ్లసింగారానికి చెందిన రమాదేవితో 22 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ప్రసాద్‌తోపాటు అత్త కుటుంబసభ్యులు గుండ్లసింగారంలో వేర్వేరు ఇళ్లలో అద్దెకు ఉంటున్నారు. ప్రసాద్ మంచిర్యాల జిల్లా కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొంతకాలం క్రితం ప్రసాద్ తన అత్త కమలాదేవి(58)కు రూ.4లక్షల అప్పుగా ఇవ్వగా తిరిగి ఆమె ఇవ్వలేదు. దీంతోపాటు అతని కాపురంలోనూ విభేదాలు వచ్చాయి. వారిపై కోపం పెంచుకున్న ప్రసాద్ అత్తతోపాటు భార్య, బావమరిదిని టార్గెట్ చేశాడు. అత్తను చంపిన తర్వాత ఇంట్లోనే ఉన్న బావమరిదిని.. అనంతరం తన ఇంటికి వెళ్లి భార్యను తుదముట్టించాలని భావించాడు. బుధవారం కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో స్టేషన్‌హౌజ్ ఆఫీసర్ తన రివాల్వర్‌ని క్లీన్‌చేసి భద్రపర్చమని ప్రసాద్‌కు చెప్పాడు. కానీ ప్రసాద్ ఆ రివాల్వర్‌ను భద్రపరిచి ఆ తరువాత ఎవరికీ తెలియకుండా తీసుకున్నాడు. అనంతరం గుండ్లసింగారం వచ్చాడు. గురువారం ఉదయం స్టేషన్‌కు వచ్చిన స్టేషన్‌హౌస్ ఆఫీసర్ రివాల్వర్ తీసుకునేందుకు వెళ్లగా కనిపించలేదు. దీంతో స్టేషన్‌లోని సీసీ ఫుటేజీని పరిశీలించి రివాల్వర్‌ను ప్రసాద్ ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. అతడికి పోలీసులు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదని సమాచారం. కోటపల్లి నుంచి గురువారం ఉదయం గుండ్లసింగారం చేరుకున్న ప్రసాద్ నేరుగా అత్త కమలాదేవి ఇంటికి వెళ్లి ఆమెను కాల్చాడు. అప్పటికే స్థానికులు గుమిగూడడం, కుటుంబ సభ్యులు రావడం.. అతనిపై దాడి చేయడంతో ముందుగా అనుకున్న ప్లాన్ వర్కవుట్ కాలేదని తెలుస్తోంది.

తూటా శబ్దంతో కలకలం

కమలాదేవిపై రివాల్వర్‌తో ఒక రౌండ్ కాల్పులు జరపడంతో ఆమె ఇంటి గేటు నుంచి రోడ్డుమీదికి రక్తమోడుతూ వచ్చి కింద పడింది. ఒక్కసారిగా పెద్దశబ్దం రావడంతో ఇరుగుపొరుగు వారు ఆందోళనకు గురయ్యారు. కొద్దిదూరంలో ఉన్న ప్రసాద్ భార్య రమాదేవితోపాటు ఆమె కూతుళ్లు, సోదరుడు హుటాహుటిన వచ్చి చూసేసరికి తల్లి చనిపోయి కనిపించడంతో బోరున విలపించారు. ఓ వైపు తల్లి మృతదేహం.. మరో వైపు ప్రసాద్ దర్జాగా కుర్చీలో కూర్చొని ఉండడంతో ఆగ్రహానికి గురయ్యారు. అతనిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. దీంతో అతని తల, శరీరంపై తీవ్రగాయాలై రక్తంతో తడిసిపోయాడు.

ఆధారాల సేకరణ..

సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి, వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు ఘటనస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఘటనపై ఇరుగుపొరుగు వారిని, కమలాదేవి కూతురు రమాదేవిని అడిగి తెలుసుకున్నారు. రక్తనమూనాలు సేకరించారు. కాల్చిన బుల్లెట్ షెల్ కోసం దాదాపు గంటరన్నపాటు వెతికినా లభ్యం కాలేదు.

కొంతకాలంగా వేర్వేరుగా..

ప్రసాద్, రమాదేవిలు కుటుంబ కలహాలతో కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. కొద్దిరోజుల క్రితం తనను వేధింపులకు గురి చేస్తున్నాడని రమాదేవి నగరంలోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసింది. ఈ విషయాన్ని ప్రసాద్ అవమానకరంగా భావించినట్లు చర్చ జరుగుతోంది. దీనంతటికి భార్యతోపాటు అత్త, బావమరిది కారణమని కోపం పెంచుకున్న అతను ఈ ఘాతుకానికి పాల్పడినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

సమగ్ర దర్యాప్తు - ఎంఏ బారి, డీసీపీ

హత్యపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి తెలిపారు. ఈ హత్యకు ఆర్థిక, ఇతరత్రా కారణాలు ఉన్నాయనే అంశంపై విచారణ చేపడతామన్నారు. ప్రస్తుతం నిందితుడి పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. మృతురాలి కూతురు రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిస్సింగ్‌పై విచారణ



ప్రసాద్(ఫైల్)

కోటపల్లి: కోటపల్లి పోలీసుస్టేషన్‌లో గన్ మిస్సింగ్‌పై రామగుండం కమిషనరేట్ పోలీసులు గురువారం విచారణ చేపట్టారు. మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్ కేకన్ స్టేషన్‌కు చేరుకుని సుమారు ఆరు గంటలపాటు విచారణ జరిపారు. నిందితుడు ఉపయోగించింది సర్వీస్ గన్ కావడంతో పోలీసు అధికారులు వెంటనే రంగంలోకి దిగి ఆయుధం అతడి చేతికెలా వచ్చింది..? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. ప్రసాద్ షార్ట్ వెపన్ తీసుకెళ్లడంపై సమగ్ర విచారణ చేపట్టే పనిలో నిమగ్నమయ్యారు. రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించిన డీసీపీ పలువురి వాంగ్మూలం తీసుకున్నట్లు తెలుస్తోంది.

వివాదాస్పదుడే..

ప్రసాద్ వైఖరి మొదటి నుంచీ వివాదాస్పదంగానే ఉంది. గతంలో హోంగార్డుగా పని చేసిన ప్రసాద్ 2012–13 కానిస్టేబుల్ ఉద్యోగం రావడంతో పెద్దపల్లి జిల్లాలో పని చేశాడు. మద్యానికి బానిసై విధుల్లో నిర్లక్ష్యం, ఆర్థిక ఇబ్బందులతో గొడవ పడేవాడని సమాచారం. మూడు నెలల క్రితమే పెద్దపల్లి జిల్లా నుంచి మారుమూల ప్రాంతమైన కోటపల్లి పోలీసుస్టేషన్‌కు బదిలీ అయ్యాడు. విధుల్లో చేరినప్పటి నుంచి ఎక్కువగా విధులకు డుమ్మా కొట్టడం, తోటి సిబ్బందితో అమర్యాదగా వ్యవహరించడంతో సిబ్బంది అతడికి దూరంగా ఉండేవారని తెలిసింది.

దొంగతనం కేసు

కానిస్టేబుల్ ప్రసాద్‌పై దొంగతనం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.సురేష్‌కుమార్ తెలిపారు. స్టేషన్‌లోని ఆయుధ కారాగారంలో ఉంచిన పిస్టల్‌ను అపహరించుకుపోయాడని పేర్కొన్నారు.

క్రీడా పోటీల సంరంభం



క్రీడల నిర్వహణకు సిద్ధమైన సీఓఈ క్రీడా మైదానం

- నేటి నుంచి బెల్లంపల్లిలో జోనల్ స్థాయి పోటీలు
- హాజరు కానున్న 935 మంది విద్యార్థులు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బెల్లంపల్లి బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) విద్యాలయం కాళేశ్వరం జోనల్ స్థాయి బాలుర క్రీడా పోటీలకు సిద్ధమైంది. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న క్రీడా పోటీల సంరంభం ఈ నెల 16వరకు కన్నుల పండువగా సాగనుంది. కాళేశ్వరం జోన్ పరిధిలోని ములుగు, పెద్దపల్లి, మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లోని 11 సంక్షేమ గురుకుల విద్యాలయాల నుంచి 935 మంది విద్యార్థులు పోటీలకు హాజరు కానున్నారు. మరో 150 మంది వరకు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు క్రీడల్లో భాగస్వాములు అవుతారు. ప్రారంభ, ముగింపు పోటీలకు సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి నవీన్ నికోలస్, జిల్లా కలెక్టర్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, రామగుండం సీపీ రెమా రాజేశ్వరిలను ఆహ్వానించారు.

ముస్తాబైన క్రీడా మైదానం

క్రీడల నిర్వహణకు మైదానాన్ని ముస్తాబు చేశారు. పిచ్చిమొక్కలు పెరిగి, రాళ్లు, ఎత్తుపల్లాలతో ఉన్న ఆట స్థలాన్ని ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. జేసీబీ, ట్రాక్టర్లతో రేయింబవళ్లు పని చేయించి ఆటలకు అనువుగా సమాంతరంగా తయారు చేశారు. రన్నింగ్ ట్రాక్, వాలీబాల్, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్ కోర్టులు ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను సంక్షేమ గురుకులాల రాష్ట్ర స్పోర్ట్స్ అధికారి రామ్‌లక్ష్మణ్, సంక్షేమ గురుకులాల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్సీవో స్వరూపారాణి పర్యవేక్షించారు.

మూడు విభాగాల్లో..

మూడు విభాగాలు అండర్–14, 17, 19 పోటీలు నిర్వహించనున్నారు. కబడ్డీ, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, ఖోఖో, టెన్నికాయిట్, చదరంగం, క్యారమ్స్‌తోపాటు 100, 200, 400, 800, 1500 మీటర్లు, ఐదు కిలోమీటర్లు, 4ఇన్‌టు 100 రిలే పరుగు పందెం పోటీలు నిర్వహిస్తారు. షాట్‌పుట్, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్ క్రీడాంశాల్లో పోటీలకు ఏర్పాటు చేశారు. క్రీడాకారులు, ఉపాధ్యాయులు భోజన, వసతి సౌకర్యాలు కల్పించనున్నామని, క్రీడల నిర్వహణకు అన్ని రకాల ఏర్పాటు చేశామని బెల్లంపల్లి సీఓఈ ప్రిన్సిపాల్ సైదులు తెలిపారు.

పోటీలను సద్వినియోగం చేసుకోవాలి



చెన్నూర్‌లో జరిగే పోటీలకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు



చెన్నూర్‌లో జోనల్ స్థాయి పోటీల వివరాలు వెల్లడిస్తున్న ఆర్‌సీవో స్వరూపారాణి

- జోనల్ స్థాయి పోటీలకు ఏర్పాట్లు పూర్తి
- వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు

చెన్నూర్: విద్యార్థినులు జోనల్ స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలను సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి అన్నారు. చెన్నూర్ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఈ నెల 13 నుంచి 16 జరిగే జోనల్ స్థాయి క్రీడా పోటీల ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాళేశ్వరం జోన్–1లోని 15 పాఠశాలల నుంచి 1,275 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. నల్లగొండ జిల్లాకు చెందిన నందిని హైదరాబాద్ గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యాభ్యాసం చేస్తోందని, ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో బ్రాంజ్ మెడల్ సాధించిందని తెలిపారు. కోట పల్లి మండలానికి చెందిన ప్రణయ్, జైపూర్ మండలానికి చెందిన రవికిరణ్ పారా ఒలింపిక్ క్రీడల్లో రాణించారని గుర్తు చేశారు. జోనల్ స్థాయి క్రీడా పోటీల విజేతలు వచ్చే ఏడాది రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అండర్–14, 17, 19 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ రాజమణి, పీఈటీ రేష్మా, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు తగరం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో ఎస్టీపీపీ ముందంజ

- గ్రీన్‌హైడ్రోజన్ ఉత్పత్తికి చర్యలు
- డైరెక్టర్ సత్యనారాయణరావు

జైపూర్: పర్యావరణ పరిరక్షణలో ఎస్టీపీపీ ముందంజలో నిలుస్తోందని, థర్మల్ విద్యుత్ ద్వారా పని చేస్తున్న హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రాన్ని ఇక మీద నుంచి సోలార్ విద్యుత్ ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడం జరుగుతుందని సింగరేణి డైరెక్టర్ డి.సత్యనారాయణరావు తెలిపారు. మండల కేంద్రంలోని 1200మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటును గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పవర్ ప్లాంటులో రెండు యూనిట్ల ద్వారా జరుగుతున్న విద్యుత్, ఉత్పత్తి నిర్వహణ అంశాలపై అధికారులతో చర్చించారు. విద్యుత్ ఉత్పత్తిలో కొన్ని యంత్రాలు వేడెక్కడం జరుగుతుందని, ఇలా వేడెక్కిన యంత్రాలను చల్లార్చడానికి హైడ్రోజన్ వాయువును వినియోగిస్తామని, ఎస్టీపీపీ ప్రాంగణంలో ఉన్న హైడ్రోజన్ ప్లాంటును గ్రీన్ హైడ్రోజన్ ప్లాంటుగా మార్చడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 500మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళిపై ఇతర డైరెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించారు. అన్ని ఏరియాల్లో ఉత్పత్తి, ఉత్పాదకతలపై సమీక్షించారు. ఎస్టీపీపీ జీఎం బసివిరెడ్డి, సోలార్ జీఎం విశ్వనాథరాజు, వర్క్‌షాప్స్ జీఎం జానకిరామ్, ఎస్‌ఓటు డైరెక్టర్ ఫిజేరాల్డ్, ఏజీఎం కెవీ.రావు, అధికారులు పాల్గొన్నారు.



హైడ్రోజన్ ప్లాంటును పరిశీలిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణరావు, అధికారులు

క్లుప్తంగా

ఉద్యోగులపై కలెక్టర్ ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్..

మంచిర్యాలక్రైం: నస్పూర్ సమీకృత కలెక్టరేట్‌లోని కార్యాలయాల ఉద్యోగులపై కలెక్టర్ బి.సంతోష్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. 'కలెక్టరేట్‌లో మద్యం స్టిక్కర్ కలకలం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు గురువారం ఆయన స్పందించారు. క్షేత్రస్థాయిలో ఆయా శాఖలకు చెందిన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మద్యం సేవించి విధుల్లో పాల్గొంటే వారి సమాచారం అందించాలని, వారిపై తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలోని అన్ని మరుగుదొడ్లు, బహిరంగ ప్రదేశాలు పరిశీలించారు. రెండో ఫ్లోర్‌లోని ఎఫ్-20 వీఐపీ టాయిలెట్‌ను పరిశీలించి అందులో అతికించి ఉన్న మద్యం స్టిక్కర్‌ను తొలగింపజేశారు. కార్యాలయ ఉద్యోగుల.. ఎవరైనా బయటి వ్యక్తులు మద్యం వెంట తెచ్చుకుని టాయిలెట్‌లో సేవించారా అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది.

నలుగురి బైండోవర్

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు సలుగుపల్లి, మర్థిడి గ్రామాలకు చెందిన నలుగురు మాజీ అనుమానిత వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై విక్రం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బైండోవర్ చేయడం జరిగిందని పేర్కొన్నారు.

పూజారిని బెదిరించిన విలేకరిపై కేసు

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్‌లోని ఏ జోన్ రామాలయం ఆలయ పూజారి పానిపట్ల చక్రవర్తిని బెదిరించిన ఓ పత్రిక విలేకరి(సాక్షి కాదు)పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పూజారి చక్రవర్తి భార్య శాలినీకి పట్టణానికి చెందిన వెంకటలక్ష్మికి ఒక ఉంగరం విషయంలో గొడవ జరిగింది. వెంకటలక్ష్మికి మద్దతుగా నిలిచిన సదరు విలేకరి జోసెఫ్ అలియాస్ సంతోష్ పూజారిని బెదిరించాడు. రూ.రెండు లక్షలు ఇవ్వకపోతే వెంకటలక్ష్మితో ఫిర్యాదు చేయించి పోలీస్ కేసు, దేవాలయ సంబంధిత కేసులు నమోదు చేయిస్తానని హెచ్చరించాడు. దీంతో మనస్తాపం చెందిన చక్రవర్తి గుర్తు తెలియని మాత్రలు మింగి బుధవారం రాత్రి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా ఆరోగ్యం నిలకడగా ఉంది. పూజారి భార్య ఫిర్యాదు మేరకు విలేకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నీటిలో గల్లంతైన వ్యక్తి మృతి

బెజ్జూర్: మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన మాడే శంకర్ (51) బుధవారం సాయంత్రం గ్రామ సమీపంలోని చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందినట్లు ఎస్సై విక్రం తెలిపారు. భార్య రాజక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీని నిరోధించాలి

పాతమంచిర్యాల: ప్రజాస్వామ్య రక్షణకు ఎన్నికల్లో డబ్బు, మద్యం పంపిణీని నిరోధించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగిందని, పాలక బూర్జువా పార్టీలు మద్యం, డబ్బును ఎరగా చూపి ఓట్లు పొందాలని చూస్తున్నాయన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రేగుంట చంద్రకళ ఉన్నారు.

జంగ్ తెలంగాణ

ఖాకీల 'కోడ్' కూత..!

- కమిషనరేట్ పరిధిలో రంగంలోకి పోలీసులు
- లైసెన్స్‌డ్ తుపాకులు డిపాజిట్ చేయాలని హెచ్చరికలు
- రౌడీషీటర్లు, మాజీలకు కౌన్సెలింగ్
- బెల్ట్ షాపులపై దాడులు
- ఠాణాల పరిధిలో బైండోవర్లు



నగదును సీజ్ చేస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో జిల్లాలోని పలువురు వ్యక్తుల వద్ద ఉన్న లైసెన్స్ తుపాకులను ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధి అధికారులకు అప్పగించాలని హెచ్చరికలు జారీ చేశారు. ఆయా ఠాణాల పరిధిలోని పాత నేరస్తులను, రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్, బైండోవర్లు నిర్వహించేందుకు వారి జాబితాను సిద్ధం చేస్తున్నారు. మద్యం, డబ్బు కట్టడి చేసేందుకు బెల్ట్ షాపులపై దాడులు, ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు.

రామగుండం పోలీస్ కమిషరేట్ పరిధిలోని అసెంబ్లీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేస్తోంది. సీపీ రెమా రాజేశ్వరి ఆధ్వర్యంలో ఇప్పటికే చర్యలు చేపట్టారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, చెన్నూర్ బెల్లంపల్లి, రామగుండం, మంథని, పెద్దపెల్లి ఖానాపూర్ నియోజవర్గ పరిధిలోని జన్నారం కమిషనరేట్ పరిధిలో ఉన్నాయి.

రౌడీ షీటర్లపై నిఘా..

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లాలో 202 మందిపై రౌడీషీట్ నమోదైంది. ఇందులో కొందరు మృతిచెందగా మరికొందరు మాకం మార్చేశారు. ప్రస్తుతం జిల్లాలో 185 మంది ఉన్నారు. ఇందులో కొందరు సత్ప్రవర్తనతో మసులుకుంటుండగా.. మరికొందరు యథావిధిగా తమ పంథాను కొనసాగిస్తున్నారు. పోలీస్‌స్టేషన్ల వారిగా రౌడీ షీట్ రికార్డుల ఆధారంగా పోలీసులకు కొంత అవగాహన ఉన్నా కొత్తగా భూ వివాదాల సెటిల్‌మెంట్లు, పంచాయతీల్లో జోక్యం చేసుకుని దౌర్జన్యం చేస్తూనే ఉన్నారు. ఇలాంటి వారిని గుర్తించి వారు ఎక్కడనున్నారు.. ప్రస్తుతం ఏమి చేస్తున్నారో పూర్తి వివరాలు సేకరించే పనిలో ఇప్పటికే నిమజ్ఞమయ్యారు. వారిపై పూర్తి స్థాయి నిఘా కోసం ప్రత్యేక యంత్రాంగం పనిచేస్తోంది.

లైసెన్స్‌డ్ తుపాకులు డిపాజిట్...

ఎన్నికల సందర్భంగా లైసెన్స్‌డ్ తుపాకి కలిగి ఉన్న వారి నుంచి పోలీసులు వాటిని డిపాజిట్ చేయించుకుంటున్నారు. జిల్లాలో 17 లైసెన్స్ తుపాకులున్నాయి. ఇందులో 11 బ్యాంకు సెక్యూరిటీ సిబ్బంది వద్ద ఉన్నాయి. పోలీసుల ఆదేశాలతో బ్యాంకుల సెక్యూరిటీ అధికారులు మినహా మిగిలిన వారు తమ వద్ద ఉన్న ఆయుధాలను ఆయా ఠాణాల్లో డిపాజిట్ చేయాలని సూచించారు. వాటిని కమిషనరేట్‌లోని ఆయుధ కారగారంలోకి తరలించనున్నారు.

బైండోవర్లతో అల్లరిమూకల కట్టడి..

కమిషనరేట్ పరిధిలో ఎన్నికల వేల అల్లరి మూకలను కట్టడి చేసేందుకు బైండోవర్లు చేయాలని సీపీ ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాజకీయ పార్టీల్లో ఉంటూ గొడవలు సృష్టించే వారి జాబితాను ఇప్పటికే సిద్ధం చేశారు. గతంలో బైండోవర్లు చేసినవారందరినీ మళ్లీ బైండోవర్ చేయనున్నారు. అలాగే ఇటీవల వివిధ కేసుల్లో, గొడవల్లో పాల్గొన్న వారిని, మాజీలను, నేరస్తులను, వివిధ కేసుల్లో నిందితులను, రౌడీషీటర్లను బైండోవర్లు చేయనున్నారు.

రాజకీయ జోక్యం పోవాలి

- ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య



మాట్లాడుతున్న వీరభద్రయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో రాజకీయ జోక్యం పోవాలని, అప్పుడే సంస్థ బాగుపడుతుందని ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. వీరభద్రయ్య అన్నారు. గురువారం ఆయన ఎస్సార్పీ 1 గనిపై ర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. సింగరేణి సంస్థకు వచ్చిన లాభాలను రాష్ట్ర ప్రభుత్వం ఖజానాకు మళ్లించడంతో సంస్థ అప్పుల పాలైందన్నారు. చివరికి కార్మికులకు వేతనాలు చెల్లించడానికి కూడా యజమాన్యం బ్యాంకుల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సిన అవసరం ఏర్పడిందని ఆరోపించారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉన్న రూ.29వేల కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం వైఫల్యంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బులు రాలేకపోతున్నాయన్నారు. ఈ నెల 28న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు జరగాల్సి ఉన్నాయని, గురువారం దీనిపై హైకోర్టులో వాదనలు జరుగగా కోర్టు డిసెంబర్ 27కు ఎన్నికలను వాయిదా వేసిందన్నారు. దీనికి యాజమాన్యం, ప్రభుత్వం కారణమని, వీరికి 11 కార్మిక సంఘాలు కూడా వంతపాడటంతో ఎన్నికలు వాయిదా పడ్డాయని తెలిపారు. ఇదిలా ఉంటే గనిలో కార్మిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారిపైనే అధికారులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచి సహాయ కార్యదర్శి ఎం.కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, ఏరియా కార్యదర్శి కామెర వేణు, ఫిట్ సెక్రెటరీ దాడి రాజయ్య, మైనింగ్ స్టాఫ్ నాయకులు మారేపల్లి బాబు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు ఉన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్ పనుల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న డైరెక్టర్

చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌లోని 2-ఇంక్‌లైన్ గని ఆవరణలో సింగరేణి ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభించే సోలార్ పవర్ ప్లాంట్ పనులను సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) సత్యనారాయణరావు, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, సోలార్ జీఎం జానకిరామ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్న ఎన్‌రిచ్ ఎర్త్ కంపెనీ అధికారులతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తి చేసి 11 మెగావాట్స్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించి ఎన్‌పీడీసీఎల్‌కు అనుసంధానం చేయాలని ఆదేశించారు. అంతేకాకుండా చెన్నూర్-1 ఇంక్‌లైన్ వద్ద ఏర్పాటు చేసే 27.5 మెగావాట్స్ సోలార్ పవర్‌ప్లాంట్ టెండర్ల ప్రక్రియ గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

టెండర్ మాన్యువల్‌ను సవరించాలి

- అప్పటి వరకు టెండర్లు వేయం
- సింగరేణి సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వెల్లడి



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు

శ్రీరాంపూర్: సింగరేణి కాంట్రాక్ట్ పనుల్లో టెండర్ మాన్యువల్‌ను సవరించాలని సింగరేణి సివిల్ అసోసియేషన్ సెంట్రల్ అధ్యక్షుడు కనుకుల మొండయ్య యజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కంపనీ వ్యాప్తంగా 11 ఏరియాలకు చెందిన అసోసియేషన్ ఏరియా కమిటీ నాయకులు గురువారం శ్రీరాంపూర్‌లోని సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెండర్‌లలో సివిల్ కాంట్రాక్ట్ మ్యాన్యువల్ - 2023 సవరించాలని, అంతేకాకుండా ఎస్ఆర్ రేట్లను కూడా పెంచాలని డిమాండ్ చేశారు. మాన్యువల్‌లో ఉన్న నిబంధనల ప్రకారం పనిచేయడం ఇబ్బందిగా ఉందన్నారు. దీనికి తోడు ప్రస్తుతం ఉన్న ఎస్ఆర్ రేట్లతో పనులు చేస్తే నష్టం చవిచూడాల్సి వస్తుందన్నారు. దీనిపై తాము కొద్ది రోజుల క్రితం కంపెనీ సీఎండీని కలిసి వినతిపత్రం అందించినట్లు వివరించారు. దీనిపై ఇప్పటికి తమను చర్చలకు పిలువలేదన్నారు. యాజమాన్యం స్పందించనందుకు నిరసనగా గురువారం నుంచి ఏ సివిల్ పనులకు టెండర్లు వేయకుండా బాయ్‌కట్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 16న తిరిగి అసోసియేషన్ సమావేశమై భవిష్యత్ కార్యచరణను ప్రకటిస్తుందని, కాంట్రాక్టర్లందరూ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలన్నారు. సమావేశంలో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు పుప్పాల సంపత్, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, ఆర్జీ- 2 ఏరియా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఆర్జీ 3 ఏరియా ఉపాధ్యక్షుడు రాంచందర్‌రావు, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల అధ్యక్షులు సదానందం, గోపిరెడ్డి పాల్గొన్నారు.

అట్టహాసంగా జోనల్‌స్థాయి క్రీడా పోటీలు



వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు జోనల్ స్థాయి క్రీడా పోటీలు గురువారం గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు ఆర్.రమాదేవి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల అభివృద్ధికి గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొని జిల్లాకు వన్నె తేవాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో జిల్లాలోని జైనూర్, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలోని ఏటీడీవో పరిధిలోని ఆశ్రమ పాఠశాలల 14/17 వయసు గల బాలబాలికలు పాల్గొన్నారు. గెలుపొందిన క్రీడాకారులు నవంబర్ 15, 16,17 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐటీడీఏలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో 765 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవోలు ఉద్ధవ్, జగన్, ఏటీడీవోలు క్షేత్రయ్య, పురుషోత్తం, కమ్మర్ హుస్సేన్, చిరంజీవి, స్పోర్ట్స్ ఆఫీసర్స్ మీనా రెడ్డి, జీవరత్నం, జీసీడీవో శకుంతల, క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, కృష్ణమూర్తి, వినోద్, బిక్కు, ధనలక్ష్మి ఉన్నారు.

హడలెత్తిస్తున్న తోడేళ్లు

- వారంలో ఎనిమిది మూగజీవాల బలి



సీసీ కెమెరాలో చిక్కిన తోడేలు

వేమనపల్లి: మండల సమీప అటవీ ప్రాంతంలో తోడేళ్ల దాడులతో గొల్లకుర్మలు హడలిపోతున్నారు. వారంరోజుల్లో ఏడు గొర్రెలు, ఒక మేకను పొట్టన పెట్టుకున్నాయి. మండల కేంద్రానికి చెందిన కొండ అంకన్నకు చెందిన రెండు గొర్రెలు, మధుకు చెందిన ఒక గొర్రె, గుండయ్యకు చెందిన ఒక గొర్రె, దస్నాపూర్‌లో మూడు గొర్రెలు, ఒక మేకపై దాడికి పాల్పడ్డాయి. దస్నాపూర్‌తో పాటు మంగెనపల్లి, రాజారాం, ఒడ్డుగూడం శివారు అటవీ ప్రాంతంలో తోడేళ్ల మందలు సంచరిస్తున్నాయి. 15 వరకు ఉన్న ఈ తోడేళ్లు 3, 4 చొప్పున విడిగా తిరుగుతున్నట్లు సమీప గ్రామస్తులు తెలుపుతున్నారు. తోడేళ్ల దాడులకు భయపడి గొల్లకుర్మలు మందలతో అడవులకు వెళ్లడానికి భయపడుతున్నారు. పంట పొలాలు ప్రాణహిత తీరం వెంట గొర్రెలు, మేకలను మేపుకుంటున్నారు. తోడేళ్లతో పాటు అడవి కుక్కల సంచారం ఎక్కువగా ఉండడంతో వీటి భయానికి ఈ ప్రాంతంలో తిరుగుతున్న పులి, చిరుతపులి బెదిరి వేరే ప్రాంతాలకు మకాం మార్చుతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి మూడేళ్ల జైలు

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్‌రూరల్: పాత కక్షలతో సాగునీటి పైపుల కోసం గొడవ పడి గొడ్డలితో దాడి చేసిన కేసులో కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడకు చెందిన చిలుకూరి ప్రతాప్‌కు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.యువరాజ గురువారం తీర్పు చెప్పారు. అదనపు పీపీ జీవిఎస్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడకు చెందిన చిలుకూరి ప్రతాప్, జి.మల్లేశ్ వ్యవసాయ భూమి గజ్జిగూడ శివారులో ఉంది. వీరి ఇరువురికి పాత కక్షలున్నాయి. ఈ క్రమంలో ఫిబ్రవరి 18, 2019న చేనుకు సంబంధించిన సాగునీటి పైపుల విషయమై గొడవ పడి మల్లేశ్‌పై ప్రతాప్ గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. మల్లేశ్ ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మల్లేశ్ కుమారుడు సాయికుమార్ కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. 17మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

రెబ్బెన: మండలంలోని పుంజుమేరగూడ బస్టాండ్ సమీపంలోని పెట్రోల్‌బంక్ వద్ద జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని కారు ఢీకొని మండల కేంద్రానికి చెందిన సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... సంతోష్ పుంజుమేరగూడ వద్ద ఉన్న పెట్రోల్‌బంక్‌కు ఎదురుగా బైక్ నిలిపి పెట్రోల్ కోసం రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో రెబ్బెన నుంచి కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో సంతోష్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అతడిని మంచిర్యాలకు తరలించారు.

పట్టుబడుతున్న నగదు

- వాహన తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసులు



బెల్లంపల్లి: నగదు సీజ్‌చేస్తున్న అధికారులు



పట్టుకున్న నగదుతో అధికారులు



దహెగాం: వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజక వర్గకేంద్రం బెల్లంపల్లిలో గురువారం ఓ ఆర్ఎంపీ వద్ద రూ.లక్ష నగదును ఎన్నికల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాండూర్‌కు చెందిన చిలుముల శ్రీధర్ అనే ఆర్ఎంపీ వైద్యుడు అనుమానాస్పదంగా కనిపించడంతో కాల్ టెక్స్‌వద్ద తనిఖీ చేయగా అతడి వద్ద రూ.లక్ష లభించాయి. ఆ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు, పత్రాలు చూపించకపోవడంతో ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ బెల్లంపల్లి టీమ్ అధికారి ఎల్తూరి సురేఖ, పోలీసులు జప్తు చేసుకుని సీజ్ చేశారు. బైక్‌పై శ్రీధర్ బెల్లంపల్లి నుంచి తాండూర్ వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది.

రూ.85వేలు సీజ్ ..

బెల్లంపల్లిలో గురువారం రాత్రి వన్‌టౌన్ పోలీసులు కన్నాల రైల్వే ఫ్లైఓవర్ వంతెన హనుమాన్ విగ్రహం వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. మహ్మద్ ఫిరోజ్ అనే వ్యక్తి వద్ద రూ.85వేలు దొరికాయి. మంచిర్యాలలో నివాసముంటున్న ఫిరోజ్ కోళ్ల వ్యాపారం చేస్తున్నాడు. బెల్లంపల్లి, తాండూర్ ప్రాంతాల్లోని చికెన్ సెంటర్‌లకు కోళ్లను సరఫరా చేసి వాటి తాలూకు డబ్బులను వసూలు చేసి తీసుకెళ్తున్నట్లు బాధితుడు తెలినప్పటికీ ఎన్నికల అధికారులకు ఆధారాలు చూపించకపోవడంతో సీజ్ చేశారు. ఎస్సైలు రమేష్, విఠల్ ఉన్నారు.

వాంకిడిలో రూ.1.20 లక్షలు..

వాంకిడి: ఎన్నికల కోడ్‌లో భాగంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం రాత్రి వాహనాల తనిఖీల్లో రూ.1.20 లక్షలు పట్టుబడినట్లు ఎంపీవో శివకుమార్ తెలిపారు. రోషన్, రమేష్ అనే వ్యక్తులు నాగ్‌పూర్ నుంచి వస్తుండగా వారి వద్ద ఎలాంటి రసీదులు లేకపోవడంతో రూ.1.20 లక్షలు సీజ్ చేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ పాల్గొన్నారు.

తాండూర్‌లో రూ.లక్ష నగదు..

తాండూర్: మండలంలోని రేపల్లెవాడలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్ పోస్ట్ వద్ద సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో రూ.లక్ష నగదును పట్టుకున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)కి చెందిన మదిరే అంజయ్య తన వాహనంలో ఎలాంటి ధృవీకరణ పత్రాలు లేకుండా రూ.లక్ష నగదును చెన్నూర్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వినయ్ చేరుకుని ఆ నగదును సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఎస్సై రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ఇందారం చెక్‌పోస్టు వద్ద రూ.39లక్షలు సీజ్

జైపూర్: మంచిర్యాల-పెద్దపల్లి జిల్లా సరిహద్దు ప్రాంతమైన ఇందారం వద్ద ఎన్నికల నియమావళిలో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద గురువారం రూ.39లక్షలను పోలీసులు సీజ్ చేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన ఓ రెండు ప్రైవేట్ బ్యాంకులు గోదావరిఖని నుంచి వేర్వేరు వాహనాల్లో రూ.35లక్షలు, మరో వాహనంలో రూ.4లక్షలు మంచిర్యాలకు తరలిస్తుండగా ఇందారం చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో భాగంగా రెండు వాహనాల్లో మొత్తం రూ.39లక్షలను పట్టుకోగా ఆ నగదుకు సంబంధించిన సరైన పత్రాలు లేని కారణంగా డబ్బులను సీజ్ చేసి ఆర్వోకు అప్పగించినట్లు శ్రీరాంపూర్ సీఐ రాజు, ఎస్సై ఉపేందర్‌రావు తెలిపాడు.



ఇందారం చెక్‌పోస్టు డబ్బులు సీజ్ చేస్తున్న సీఐ, ఎస్సై

నగదు పట్టివేత

దహెగాం: ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో రూ.50వేలకు మించి నగదు తరలిస్తే వాటికి ఆధారాలు చూపాలని పోలీసులు పేర్కొంటున్నారు. ఎస్సై సనత్‌కుమార్ వివరాల ప్రకారం.. కుమురం భీం జిల్లా సరిహద్దు మండలంలోని కల్వాడ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద గురువారం వాహనాల తనిఖీల్లో పడాల సుదర్శన్ బెల్లంపల్లి నుంచి దహెగాం వైపు వాహనంలో వస్తుండగా తనిఖీ చేయగా రసీదు లేని రూ.1.67 లక్షల నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపాడు.

రూ.2,28 లక్షలు సీజ్

మంచిర్యాలక్రైం: నస్పూర్‌కు చెందిన గాదే శేఖర్ ఆధారాలు లేకుండా రూ.2లక్షలా 28వేలు నగదును తరలిస్తుండగా ఎస్సై రాజేందర్ పట్టుకుని సీజ్ చేశారు. ఆయన వివరాల ప్రకారం.. ఎలక్షన్ కోడ్ అమలు నేపథ్యలో గురువారం మార్కెట్ ఏరియాలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా శేఖర్ తన వాహనంపై స్థానిక మార్కెట్‌లో తిరుగుతున్నాడు. అనుమానాస్పదంగా ఉన్న శేఖర్‌ను తనిఖీ చేయగా రూ.2లక్షలా 28వేలు లభించాయి. నగదును సీజ్ చేసి ఎన్నికల నోడల్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

రూ.83,123 సీజ్

జైనూర్: జంగా చెక్‌పోస్ట్ వద్ద బుధవారం రాత్రి వాహనాల తనిఖీల్లో జైనూర్ నుంచి ఇంద్రవెల్లికి వెళ్తున్న ఓ వ్యాపారి వద్ద రూ.83,123లను పట్టుకున్నట్లు ఎంపీడీవో ప్రభుదయ తెలిపాడు. ఆధారాలు లేకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సందీప్‌కుమార్‌కు అప్పగించినట్లు చెప్పాడు.

ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో తాండూర్ విద్యార్థులు



బహుమతులు అందిస్తున్న అధికారులు

తాండూర్: ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో తాండూర్ మండలంలోని విద్యాభారతి విద్యార్థులు సత్తాచాటారు. గురువారం బీఎస్ఎన్ఎల్ 23వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో విద్యాభారతి విద్యార్థులు రెండు బహుమతి సాధించాడు. 5వ తరగతి చదువుతున్న వినయ్ ప్రథమ స్థానం, అఖిల తృతీయ స్థానంలో నిలిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సురభి శరత్ కుమార్,బీఎస్ఎన్ఎల్ అధికారులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఒకరికి గాయాలు

జైపూర్: మండలం నర్వ బస్టాండ్ సమీపంలోని మంచిర్యాల-చెన్నూర్ 63వ జాతీయ రహదారిపై గురువారం కారు టైరుపగిలి బోల్తాకొట్టింది. ఇందులో కారు నడుపుతన్న సీసీసీకి చెందిన ఆవుల కుమారస్వామి గాయపడ్డాడు. కుమారస్వామి సొంత పని నిమిత్తం జైపూర్ వచ్చి తిరిగి సీసీసీకి వెళ్తున్న క్రమంలో కారు ప్రమాదానికి గురైంది. స్థానికులు అతడిని మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

తాండూర్: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి గురువారం బెల్లంపల్లి జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.ముకేష్ రెండున్నర ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... తాండూర్ ఐబీకి చెందిన పుల్లం రాజ్‌కుమార్ తన స్నేహితుడు కిరణ్‌తో కలిసి 2015, అక్టోబర్ 20న గోపాల్‌నగర్ గ్రామంలోని స్నేహితులను కలవడానికి బైక్‌పై వెళ్లారు. తిరిగి ఐబీలోని ఇంటికి వస్తుండగా తాండూర్ గ్రామ శివారులో పత్తి చేను వద్ద బుర్స విజయ్ అనే వ్యక్తి ఆటో ట్రాలీతో వేగంగా ఎదురు వచ్చి బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో పుల్లం రాజ్ కుమార్‌కు తీవ్ర గాయాలై మృతిచెందాడు. కిరణ్ స్వల్ప గాయాలతో తృటిలో బయటపడ్డాడు. అప్పటి ఎస్సై అశోక్ కుమార్ కేసు నమోదు చేసుకుని కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశాడు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడు బుర్స విజయ్‌కు పై విధంగా జైలుశిక్ష, రూ.6 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపాడు.

20 లీటర్ల గుడుంబా పట్టివేత



బెల్లం పానకాన్ని పారబోయిస్తున్న పోలీసులు

దండేపల్లి: మండలంలోని పాతమామిడిపల్లిలో ఓ ఇంటి వద్ద గుడుంబా తయారు చేసి అమ్ముతున్నారనే సమాచారం మేరకు ఎస్సై ప్రసాద్ సిబ్బందితో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఆ ఇంట్లో 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. తయారుకు ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ మేరకు గుడుంబా తయారు చేసి అమ్ముతున్న బాపురావ్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

గుడుంబా స్థావరాల ధ్వంసం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని మోసం గ్రామ శివారులో నిర్వహిస్తున్న గుడుంబా స్థావరాలపై ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. గుడుంబా బట్టీలతో పాటు గుడుంబా తయారీకి ఉపయోగించే సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గుడుంబా తయారు చేసినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా గుడుంబా అమ్మినట్లయితే తమకు సమాచారం అందించాలని సూచించారు.